


మారిక పాఠశాల హెచ్‌ఎం శ్రీకాంత్‌ సస్పెన్షన్‌

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్‌ /వేపాడ

వేపాడ మండలం కరకవలస పంచాయతీ మారిక గ్రామంలోని మండల పరిషత్‌ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్‌.విమల శ్రీకాంత్‌ విధులకు గైర్హాజరు కావడంతో ఆయనను సస్పెండ్‌ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి యు.మాణిక్యంనాయుడు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సిపిఎం నాయకులు చేపట్టిన ప్రజాచైతన్యయాత్రలో ఆ ఉపాధ్యాయుడు పాఠశాల విధులకు డుమ్మా కొట్టి నెలలో నాలుగు రోజులు మాత్రమే విధులకు హాజరై, మిగతా అన్ని రోజుల్లోనూ రిజిస్టర్‌లో సంతకాలు పెట్టేస్తున్నట్లు వెలుగు చూసింది. ఈనేపథ్యంలో 'ఆ ఉపాధ్యాయుడికి నెలకొకరోజే బడి' అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. స్పందించిన డిఇఒ ఉపాధ్యాయుడు శ్రీకాంత్‌పై ఎంఇఒతో విచారణ చేయించారు. గ్రామస్తులంతా ఆ ఉపాధ్యాయుడు పాఠశాలకు రావడం లేదని, ఏడాదిలో ఒకటి రెండు రోజులు మాత్రమే వస్తాడని చెప్పడంతో అతడిని సస్పెండ్‌ చేస్తూ డిఇఒ ఉత్తర్వులు జారీ చేశారు.

రైతన్నలకు కష్టాలు

ప్రభుత్వాల తప్పుడు నిర్ణయాలు రైతుల పాలిట శాపాలుగా మారుతున్నాయి. గత వైసిపి ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే తప్పుడు తడకగా ఉందని చెప్పిన టిడిపి ప్రభుత్వం తాజాగా చేపడుతున్న సర్వే సైతం అదే తోవలో ఉందని రైతులు అంటున్నారు. ప్రభుత్వాలు రైతే రాజు అని చెప్పుకుంటూ వారి నడ్డి విరిచేలా చట్టాలు తేవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.



భూముల అమ్మకాలు, కొనుగోలుపై ఇబ్బందులు ● సర్వే నంబర్‌, ఎల్‌పిఎంలు లేక మ్యుటేషన్‌కు అవస్థలు

ప్రజాశక్తి-రేగిడి

గత ప్రభుత్వం తప్పుడు నిర్ణయాల కారణంగా రైతుల భూముల మ్యుటేషన్‌ లోను, భూముల రిజిస్ట్రేషన్‌లోను రైతులు నానా అవస్థలు పడుతున్నారు.. ల్యాండ్‌ పార్సల్‌ మ్యాప్‌, (ఎల్‌పిఎం), సర్వే నెంబర్లు అనుసంధానం సరిగా లేకుంటే ముటేషన్‌ ప్రక్రియ జరగకపోవడంతో రైతులు తమ అవసరాలకు భూములను అమ్ముకోలేని పరిస్థితి నెలకొంది. ఒక రైతుకు ఒకేచోట నాలుగు భాగాలుగా రెండు ఎకరాలు భూమి ఉంటే, కొంత భాగం అమ్మకం చూపితే వాటికి సర్వే నెంబరు, ఎల్‌పిఎం సరిగా లేకుంటే ఆ భూములకు ముటేషన్‌ కష్టాలు తప్పడం లేదు. ఒకవేళ ఆ భూములకు జాయింట్‌ ఎల్‌పిఎంగా చేర్చి చలానా కట్టి, సమాన భాగాలుగా వేసి సర్వేయం తో సబ్‌ డివిజన్‌ చేసి ఆ మ్యాప్‌ ద్వారా ఆ గ్రామంలో చివర ఖాతా నెంబరు, సర్వే నంబరు కొత్తగా వేసి ఇవ్వడంలో అన్ని రకాల దస్త్రాలు ఉండాలని అధికారులు చెప్తున్నారు. ఇదంతా రైతులకు తలనొప్పిగా మారింది. ఒకవేళ ఎల్‌పిఎం తెలియకపోతే వారసత్వ భూముల దస్త్రాలు, పాస్‌ పుస్తకం, అడంగల్‌ ఏదో ఒకటి చూపిస్తే విచారణ ఉంటుందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

సమగ్ర భూ సర్వేలోనూ రైతులకు తప్పని ఇక్కట్లు

గత ప్రభుత్వం గ్రామాల్లో భూ సర్వే నిర్వహించినప్పటి నుంచి రైతులకు కష్టాలు మొదలయ్యాయి. సమగ్ర భూ రీ సర్వేలో సాగులో ఉన్న రైతుకు మ్యుటేషన్‌ కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే టైటిల్‌ డీడ్స్‌, పాస్‌ పుస్తకం, రిజిస్ట్రేషన్‌ ధ్రువపత్రాలు ఏదో ఒకటి ఉండాలని లేకుంటే గాని ముటేషన్‌ ప్రక్రియ ముందుకు జరగదని రెవెన్యూ అధికారులు సెలవిస్తున్నారు. రైతు భూముల మ్యుటేషన్‌కు వారసత్వం దస్త్రాలు, కొనుగోలు, అమ్మకాలు చేపడితే రికార్డుల కోసం అన్ని రకాల దస్త్రాలు ఉంటేనే మ్యుటేషన్‌ ప్రక్రియ ముందుకు సాగుతోంది. రైతులు ఏళ్ల తరబడి సాగు చేస్తున్న అన్‌ రిజిస్టర్డ్‌ భూములకు నో అబ్జెక్షన్‌ సర్టిఫికేట్‌, ఖాతాలు మిస్‌ మ్యాచ్‌, అడంగల్‌ రికార్డులు లేకపోతే మ్యుటేషన్‌లు చేయడం లేదు. దీంతో రైతులకు భూములున్నా ఎందుకూ ఉపయోగపడడం లేదని ఆవేదన చెందుతున్నారు.

జిఒలతో రైతులకు చిక్కులు



కొత్త జిఒల పేరుతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వాలు మారినా జీవోలు మారడం లేదు. మ్యుటేషన్ల ప్రక్రియతో ఇబ్బంది ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వాలు ఈ జిఒలను మార్చి రైతుల భూములు రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలి

- నారు జనార్దనరావు, సంకిలి గ్రామం

మ్యుటేషన్‌ కావడం లేదు



సర్వే నెంబరు, ఎల్‌పిఎంలు అను సంధానం లేకపోతే మ్యుటేషన్‌ పూర్తిగా జరగడం లేదు. జిరాయితీ భూముల్లో నాలుగు భాగాల్లో రెండు భాగాలు అమ్మకాలు చేపడితే ఎల్‌పిఎం ప్రకారం చలానా కట్టి మ్యుటేషన్‌ ప్రక్రియ చేపట్టమంటున్నారు. సులువుగా మ్యుటేషన్ల కోసం రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలి .

- బి.హరినాథ్‌, రేగిడి గ్రామం

అన్ని దస్త్రాలూ ఉంటే 21 రోజుల్లో వన్‌బి



రైతుల సాగులో ఉన్న జిరాయితీ భూములకు అన్ని దస్త్రాలూ ఉంటే 21 రోజుల్లో వన్‌ బి ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. వారసత్వం దస్త్రాలు, పట్టాదారు పాస్‌ పుస్తకం, కొనుగోలు, అమ్మకం దారుల దస్త్రాలు ఉన్నట్లయితే తప్పనిసరిగా మ్యుటేషన్‌ ప్రక్రియ ముందుకు సాగుతుంది. ఏదేమైనా ప్రభుత్వ నిబంధనలు ప్రకారమే జరుగుతాయి.

- ఎం. చిన్నారావు, తహశీల్దార్‌, రేగిడి

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ● తహశీల్దార్‌ కార్యాలయాల వద్ద ధర్నాలు



శృంగవరపుకోట..ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ప్రభుత్వ హామీలను అమలు చేసి, ప్రజా సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్‌ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ప్రజల వద్ద నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించాలంటూ గురువారం పట్టణంలోని తహశీల్దార్‌ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌ అరుణకుమారికి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దారపర్తి, మూలబొడ్డవర, శృంగవరపుకోట, మల్లిపూడి పంచాయతీల పరిధిలో పోడు వ్యవసాయం సాగుచేస్తున్న 274 మంది రైతులకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్‌చేశారు. ఉపాధి హామీ కూలీలకు ఆరు వారాల బకాయిలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. జాబ్‌కార్డులు ఉన్న ప్రతి కుటుంబానికీ ఏడాదిలో 200 రోజులు పని కల్పించాలని, రోజు కూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. పెందుర్తి నుంచి అరకు వెళ్లే 516బి జాతీయ రాహదారికి సంబంధించి బైపాస్‌ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులకు భూసేకరణ చట్టం-2013 ప్రకారం పరిహారం అందించాలని కోరారు. లేకుంటే ప్రస్తుతం విశాఖ-అరకు ప్రధాన రహదారిని 516బి జాతీయ రహదారిగా పనులు ప్రారంభించి, ఆక్రమణలు తొలగించాలని డిమాండ్‌ చేశారు. కిల్తంపాలెం పంచాయతీ రాయవానిపాలెం నుంచి రామన్నపాలెం వరకు 5 కిలోమీటర్ల మేర రోడ్డు వేయాలన్నారు. దారపర్తి పంచాయతీ పరిధిలో దుంగాడ నుంచి దబ్బగుంట వరకు మంజూరై నిలిచిపోయిన రోడ్డు పనులు పూర్తిచేయాలని కోరారు. బొడ్డవర పంచాయతీ అమ్మపాలెం నుంచి దారపర్తి పంచాయతీ గూనపాడు వరకు మంజూరైన రోడ్డు పనులు పూర్తిచేయాలని డిమాండ్‌చేశారు. శృంగవరపుకోట పంచాయతీ రేగపుణ్యగిరికి, కొత్తూరు నుంచి కొండమల్లిపూడి రోడ్డు పనులు ప్రారంభించాలన్నారు. ఆయా గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్‌ చేశారు. ఎస్‌సి, ఎస్‌టిల్లో అర్హులైన వారికి రేషన్‌కార్డుపై 35 కిలోల బియ్యం పంపిణీ చేయాలన్నారు. ప్రతి రేషన్‌ కార్డుపై 11 రకాల నిత్యావసర సరుకులు సరఫరా చేయాలని కోరారు. గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ, ముత్యాలు, రైతులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం రైతుల ధర్నా

తెర్లాం : తోటపల్లి కాలువ ద్వారా సాగునీరు అందించాలని సిపిఎం ఆధ్వర్యాన గురువారం స్థానిక తహశీల్దార్‌ కార్యాలయం వద్ద ఆరు గ్రామాల రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఎస్‌.గోపాలం మాట్లాడుతూ తెర్లాం మండలం మీదుగా తోటపల్లి కాలువ వెళ్తున్నప్పటికీ రైతులకు సాగునీరు అందడం లేదని తెలిపారు. దీనివల్ల చెరువులు వట్టిపోయి, పంట పొలాలు బీడు భూములుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. తోటపల్లి కాలువలో చెరువు కలిసిపోయిందని, దానికి అనుసంధానంగా ఐదు చెరువులు ఉన్నాయని చెప్పారు. సతివాడ వద్దనున్న లింగయ్య చెరువుకు నీరు ఇస్తే ఐదు గ్రామాల్లో సుమారు 1500 ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఏళ్ల తరబడి ఈ సమస్యపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతులు అందజేస్తున్నా పట్టించుకోవడం లేదని చెప్పారు. ఈ సందర్భంగా తహశీల్దార్‌ కార్యాలయంలో ఆర్‌డిఒ రామ్మోహనరావుకు వినతి అందించారు. సమస్య పరిష్కరించే వరకూ అక్కడి నుంచి కదిలేది లేదని రైతులు అక్కడే బైఠాయించారు. వంటావార్పు చేపట్టి, కార్యాలయం ముందు రైతులు భోజనాలు చేసి నిరసన కొనసాగించారు. తహశీల్దార్‌ హేమంత్‌కుమార్‌ స్పందిస్తూ తోటపల్లి ఎఇ, ఇరిగేషన్‌ ఎఇని సంప్రదించి, సమస్య పరిష్కరిస్తామని హామీనిచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు పెంకి రామారావు, సింగిరెడ్డివలస సర్పంచ్‌ సింగిరెడ్డి తిరుపతి నాయుడు, రైతులు పళ్ల నాగభూషణం, ఎందు వాసుదేవరావు, వావిలపల్లి నారాయణరావు, పెంకి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలివ్వాలని ఆందోళన

కొత్తవలస : పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యాన గురువారం స్థానిక తహశీల్దార్‌ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు గాడి అప్పారావు, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు గొంప కృష్ణమూర్తి మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు ఇంటి స్థలం లేని నిరుపేదలు ఎంతోమంది ఉన్నారని, అద్దెఇళ్లలో ఉంటూ జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ఉపాధి బిల్లులు చెల్లించలేదని చెప్పారు. విద్యుత్తు బిల్లులు అధిక మోతాదులో వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, ప్రజా సమస్యలపై దృష్టిపెట్టాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో నాగమణి, లెంక లక్ష్మి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.





తెర్లాం, కొత్తవలసలో ధర్నాలు చేస్తున్న సిపిఎం నాయకులు, రైతులు, ప్రజలు

మెదక్‌ జిల్లాలో రోడ్డు ప్రమాదం

ఇద్దరు జిల్లా వాసులు మృతి ● తీర్థయాత్రలకు వెళ్తూ మృత్యువాత



బస్సును ఢీకొన్న వ్యాను , వృత్తంలో మహిళ మృతదేహం

ప్రజాశక్తి-గుర్ల

తెలంగాణ రాష్ట్రం మెదక్‌ జిల్లా పెద్దశంకరంపేట మండలం కోళ్లపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లాకు చెందిన ఇద్దరు మృతి చెందారు. మరో 11 మంది గాయపడ్డారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. మెదక్‌ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం..

జిల్లాలోని గుర్ల మండలం పెనుబర్తి, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 40 మంది టూరిస్టు బస్సులో పలు ప్రాంతాల్లో తీర్థయాత్రలకు వెళ్లారు. కర్నూలులో ప్రసిద్ధిగాంచిన శ్రీశైలం దేవస్థానాన్ని దర్శనం చేసుకొని అక్కడి నుంచి మహారాష్ట్రలోని తుల్జా భవాని మాత ను దర్శించుకునేందుకు వెళ్తుండగా మెదక్‌ జిల్లా పెద్దశంకంపేట మండలం కోళ్లపల్లి వద్ద వీరి బస్సు రోడ్డు పక్కన ఆపి ప్రయాణికులు కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. అదే సమయంలో వెనుకనుంచి వస్తున్న డిసిఎం వ్యాన్‌ అతివేగంతో వచ్చి ఆగి ఉన్న టూరిస్ట్‌ ట్రావెల్‌ బస్సును బలంగా ఢీకొంది. దీంతో బస్సు వద్ద నిలబడి ఉన్న గుర్ల మండలం పెనుబర్తికి చెందిన రౌతు సురప్పమ్మ (60), చీపురుపల్లి మండలం ఆకులపేట గ్రామానికి చెందిన అప్పలనారాయణమ్మ (50) అక్కడికక్కడే మృతి చెందారు. మరో 11 మంది గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు క్షతగాత్రులను జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో నలుగురు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పెద్ద శంకరంపేట పోలీస్‌ స్టేషన్‌ ఎస్సై శంకర్‌ తెలిపారు.



సూరప్పమ్మ (ఫైల్‌)





విద్యుత్తు బిల్లులను దహనం చేస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు, నగర ప్రజలు

ట్రూఅప్‌ ఛార్జీలు రద్దు చేయాలని

సిపిఎం ఆధ్వర్యాన బిల్లులు దహనం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్‌

విద్యుత్తు ట్రూఅప్‌ ఛార్జీలు రద్దు చేయాలని, సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్‌ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన గురువారం ఎల్‌బిజి నగర్‌లో విద్యుత్తు బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు పి.రమణమ్మ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం విద్యుత్‌ ఛార్జీలు పెంచబోమని చెబుతూనే ట్రూఅప్‌ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీల పేరుతో ఇప్పటికే ప్రజలపై రూ.17వేల కోట్లు భారాలు వేసిందన్నారు. ఇది చాలదన్నట్లు తాజాగా సెకీ ఒప్పందం ప్రకారం విద్యుత్‌ భారాలు వేయడం దుర్మార్గమన్నారు. తక్షణం సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.రమణ, ఆర్‌.శ్రీనివాసరావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కార్మికుల ర్యాలీ

సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక స్టేడియం పేట వద్ద ప్రజలు , కార్మికులు ర్యాలీ నిర్వహించి విద్యుత్‌ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నగర అధ్యక్షులు ఎ.జగన్మోహన్‌ రావు మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు కూటమి పెద్దలు బాదుడే బాదుడు అనే పేరుతో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించిందని తెలిపారు. అధికారంలోకి వస్తే భారాలను తగ్గిస్తామని, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని, స్మార్టు మీటర్లను రద్దు చేస్తామని చెప్పి నేడు భారాలు వేస్తోందని అన్నారు. విద్యుత్‌ బిల్లులు కట్టలేక పేదలు కష్టజీవులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బిల్లులు దగ్ధం ద్వారా కూటమి ప్రభుత్వానికి తమ నిరసన తెలియ జేస్తున్నారని తెలిపారు. ప్రజలంతా స్మార్ట్‌ మీటర్లను వ్యతిరేకించాలని , స్మార్ట్‌ మీటర్ల రద్దు కోసం జరిగే పోరాటంలో పాల్గొవాలని పిలుపుని చ్చారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు రమా, నాగమ్మ, స్వప్న, కృష్ణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పిఒగా ఎప్పుడయ్యారో?

ఎపిసికి బదులు పిఒగా కారు నేమ్‌ బోర్డులో పేరు మార్పు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్‌



ప్రాజెక్టు అధికారిగా కారుపై ఉన్న బోర్డు

జిల్లా విద్యాశాఖకు అనుబంధంగా ఉన్న సమగ్ర శిక్షకు అసిస్టెంట్‌ ప్రాజెక్టు కో ఆర్డినేటర్‌ ఉంటారు. సమగ్ర శిక్ష ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం, కెజిబివి పాఠశాలలను పర్యవేక్షించడం ప్రధాన బాధ్యత. అయితే రాజీవ్‌ విద్యా మిషన్‌ నుంచి సర్వ శిక్ష అభియాన్‌గా గతంలో ఈశాఖ పేరు ఉండేది. కొన్నేళ్ల క్రితం ఆ పేరును ప్రభుత్వం సమగ్ర శిక్షగా మార్చింది. అప్పట్లో ఆశాఖ అధికారికి పిఒగాఉన్న డిజిగ్నేషన్‌ను ఎపిసిగా మార్చింది. దీంతో సమగ్ర శిక్ష శాఖ అసిస్టెంట్‌ ప్రాజెక్టు కో ఆర్డినేటర్‌గా ప్రభుత్వం నియమిస్తూ వస్తోంది. కానీ తాజాగా సమగ్ర శిక్ష కార్యాలయం బయట ఉన్న ఎపిసి కారుకు సమగ్ర శిక్ష అభియాన్‌ పిఒగా నేమ్‌బోర్డు రాసి ఉంది. ప్రభుత్వమే ఈ డిజిగ్నేషన్‌ను మార్చిందా? లేదా ఆయనే మార్చేసుకున్నారా? అనే చర్చ సర్వత్రా జరుగుతోంది. ఈ విషయమై విద్యా శాఖ, సమగ్ర శిక్ష సిబ్బందిని ప్రశ్నిస్తే వారి నుంచి సమాధానం లేదు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి

సొంత భవనం ఏర్పాటు చేయాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్‌

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన గురువారం డిగ్రీ కళాశాల వద్ద విద్యార్థులు ధర్నా చేశారు. ఈ సందర్భంఆ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు జి.సూరిబాబు, కె.రాజు మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌ఐ పోరాట ఫలితంగా 2019లో విజయనగరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటయ్యిందని, ఆరేళ్లయినా సొంత భవనం లేకపోవడం దారుణమని అన్నారు. ఏటా 4వందల మందికి పైగా విద్యార్థులు కళాశాలలో చేరుతున్నప్పటికీ భవనాల సౌకర్యం కల్పించకపోవడం వల్ల సాంస్కతిక డిగ్రీ కళాశాలలో డిగ్రీ కళాశాల క్లాసులు నిర్వహిస్తున్నారని తెలిపారు. పర్మినెంట్‌ బిల్డింగ్‌ ఏర్పాటు చేసే లోపు తాత్కాలికంగా ఖాళీగా ఉన్న భవంతులలో క్లాసులు నిర్వహించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. ఆర్‌అండ్‌బి అతిథి గృహం స్థలాన్ని కేటాయించి భవనం నిర్మాణం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సౌమ్య, గుణ, మురళి, పండు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

గంజాయి సమూల నిర్మూలనకు చర్యలు

మూడో దశలో 7,378 కేజీల గంజాయి నిర్వీర్యం : విశాఖ రేంజ్‌ డిఐజి గోపీనాథ్‌ జట్టి

ప్రజాశక్తి - లావేరు (శ్రీకాకుళంజిల్లా)



పట్టుబడిన గంజాయిని పరిశీలిస్తున్న డిఐజి గోపీనాథ్‌, ఎస్‌పి వకుల్‌

విశాఖపట్నం రేంజ్‌ పరిధిలో గడిచిన ఎనిమిది నెలల్లో గంజాయి సమూల నిర్మూలనకు కఠిన చర్యలు చేపట్టడంతో పాటు వాటి మూలాలను గుర్తించి బాధ్యులైన వారిని నిందితులుగా చేర్చామని విశాఖ రేంజ్‌ డిఐజి గోపీనాథ్‌ జట్టి తెలిపారు. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలంలోని పాతకుంకాం పరిధిలోని రైన్‌బో ఇండస్ట్రీ వద్ద శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల పోలీసులు 226 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 7,378 కిలోల గంజాయిని డ్రగ్‌ డిస్పోజల్‌ కమిటీ ఆధ్వర్యాన గురువారం నిర్వీర్యం చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లా ఎస్‌పిలు కె.వి మహేశ్వర్‌ రెడ్డి, వకుల్‌ జిందల్‌, ఎస్‌.వి మాధవ్‌ రెడ్డి గంజాయి నిర్వీర్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ గంజాయి అక్రమ వ్యాపారాల్లో ఆస్తులు కూడబెట్టిన వ్యక్తులను గుర్తించి, వారి ఆస్తులను జప్తు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లోని రెండు కేసుల్లో ఆస్తులు జప్తు చేశామన్నారు. ఎనిమిది నెలల కాలంలో గంజాయి నిర్మూలన చర్యల్లో భాగంగా 524 కేసుల్లో 31,768 కేజీల గంజాయి, 12.05 లీటర్ల హాషిష్‌ ఆయిల్‌, 372 వాహనాలు సీజ్‌ చేసి 2050 మంది నిందితుల్ని అరెస్టు చేసినట్లు వివరించారు. అందులో 575 మంది అంతర్రాష్ట్ర నిందితులు ఉన్నారని తెలిపారు. ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి గంజాయి అక్రమ రవాణా సాగుతోందని గుర్తించి 24 అంతర్రాష్ట్ర సరిహద్దుగా, 15 జిల్లాల సరిహద్దుగా ప్రధాన చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి జిల్లా పోలీస్‌ ప్రధాన కార్యాలయాలకు అనుసంధానం చేశామన్నారు. డ్రోన్‌ కెమెరాల నిఘాతో 327 గ్రామాల్లో 90 ఎకరాల గంజాయి సాగుని గుర్తించి నిర్వీర్యం చేశామని చెప్పారు. 23 గంజాయి కేసుల్లో 40 మందికి న్యాయస్థానాల్లో శిక్షలు ఖరారు కాగా, సుమారు 20 మందికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షలు విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాల ఎఎస్‌పిలు పి.శ్రీనివాసరావు, పి.సౌమ్యలత, అంకిత సూరన, డిఎస్‌పిలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అగ్నివీర్‌లో ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరంకోట

భారత సైన్యంలో అగ్నివీర్‌ (జనరల్‌/టెక్నికల్‌) ఉద్యోగాలకు ఆన్‌ లైన్‌ ద్వారా అవివాహిత పురుష అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్‌ డాక్టర్‌ బిఆర్‌ అంబేద్కర్‌ తెలిపారు. ఈనెల 12 నుంచి ఏప్రిల్‌ 10వరకు అభ్యర్థులు www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్‌ చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌ ద్వారా రిజిస్ట్రేషన్‌ చేసుకున్న అభ్యర్థులు వారియొక్క అడ్మిట్‌ కార్డును డౌన్‌లోడ్‌ చేసుకొని ఆర్మీ ర్యాలీకి హాజరయ్యే తేదీ, సమయం పొందవచ్చునని తెలిపారు. విజయనగరం జిల్లా యువత ఆన్‌లైన్‌ పరీక్ష పాసైన వారికి ఆర్మీ ర్యాలీ (ఫిజికల్‌ ఫిట్నెస్‌ టెస్ట్‌) నిర్వహిస్తామని తెలిపారు.

అర్హతలు

అగ్ని వీర్‌ జనరల్‌ డ్యూటీ పోస్టులకు 10వ తరగతి కనీసం 45శాతం మార్కులతో ఉత్తీర్ణత, అగ్నివీర్‌ టెక్నికల్‌ పోస్టులకు ఫిజిక్స్‌, కెమిస్ట్రీ, మ్యాథ్స్‌, ఇంగ్లీష్‌ సబ్జెక్టులతో కనీసం 50శాతం మార్కులతో ఇంటర్‌ ఉత్తీర్ణత, అగ్నివీర్‌ క్లర్క్‌/స్టోర్‌ కీపర్‌ టెక్నికల్‌ పోస్టులకు ఆర్ట్స్‌, కామర్స్‌, సైన్స్‌ సబ్జెక్టులతో కనీసం 60శాతం మార్కులతో ఇంటర్‌ ఉతీర్ణతతో పాటు ప్రతి సబ్జెక్టులో కనీసం 50శాతం మార్కులతో ఉత్తీర్ణత, అగ్ని వీర్‌ ట్రేడ్స్‌ మెన్‌ పోస్టులకు 8వ/10వ తరగతి ఉత్తీర్ణత ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులు 1.10.2004 నుండి 1.4.2008 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు.

అగ్ని వీర్‌ జనరల్‌ డ్యూటీ మరియు అగ్ని వీర్‌ ట్రేడ్స్‌ మెన్‌ వారు 166 సెంటీమీటర్ల ఎత్తు, అగ్నివీర్‌ టెక్నికల్‌ వారు 165 సెం.మీ, అగ్నివీర్‌ క్లర్క్‌/స్టోర్‌ కీపర్‌/టెక్నికల్‌ వారు 162 సెం.మీ. ఎత్తు కలిగివుండాలి, ఛాతీ 77 సెం.మీ. కనీస విస్తీర్ణం కలిగి వుండి ఊపిరి పీల్చునప్పుడు 5 సెం.మీ. విస్తీర్ణం పెరగాలని, ఎత్తుకు తగిన బరువు కలిగి వుండాలని తెలిపారు. ఎంపికైన వారిని 4 సంవత్సరాలు షార్ట్‌ టర్మ్‌ సర్వీస్‌ అగ్నివీర్‌ సర్వీస్‌ లోకి తీసుకొంటారని తెలిపారు.

ఇతర వివరాలకు కార్యాలయపు పనివేళలో సెట్విజ్‌ మేనేజర్‌ కాగాన వెంకట రమణ 9849913080 నెంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్క్‌ఫెడ్ మేనేజర్ వెంకటేశ్వరరావు

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి-రాజాం

జిల్లాలోని అపరాల రైతులకు అన్ని విధాల అండగా ఉంటామని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నడిపేనా వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం బొబ్బిలి సహకార సంఘంలోను, రాజాం నియోజకవర్గంలోని సంతకవిటి గ్రామంలో పెసలు మినుములు కొనుగోలు కేంద్రాల ను ఆయన ప్రారంభించారు నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పంటను తీసుకుంటామని చెప్పారు. ఇ-క్రాప్‌లో నమోదైన వారు ముందుగానే రైతు సేవా కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

రూ.2 వేలకే రూ.40 లక్షల ప్రమాద బీమా

ప్రజాశక్తి-రామభద్రపురం

ఎస్‌బిఐ వ్యక్తిగత ప్రమాద బీమా పథకాన్ని మరింత విస్తరించినట్లు బ్రాంచ్ మేనేజర్ హరింద్ర బెలగాం తెలిపారు. ఏడాదికి రూ.2 వేల ప్రీమియంతో రూ.40 లక్షల ప్రమాద బీమా కల్పిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. ఈ పథకాన్ని పెద్దఎత్తున ఖాతాదారుల వద్దకు తీసుకెళ్లనున్నట్లు ప్రకటించారు. ఈ పథకం ద్వారా ప్రీమియం రూ.100కు రూ.2 లక్షలు, రూ.500కు 5 లక్షలు, రూ.వెయ్యికి 20 లక్షలు మొదలుకుని గరిష్టంగా రూ.2 వేలకు రూ.40 లక్షల బీమా సౌకర్యం పొందవచ్చని వివరించారు. ఈ బీమా సదుపాయం అన్ని రకాల రోడ్డు ప్రమాదాలు, కరెంట్ షాక్, వరదలు, భూకంపం, పాము, తేలు కాటు మరణాలకు వర్తిస్తుందని చెప్పారు. ఈ పథకంలో చేరేందుకు తమ బ్యాంకుల్లో పొదుపు ఖాతా ఉన్న 18 నుంచి 70 ఏళ్లలోపు వయసున్న పురుషులు, మహిళలు అర్హులని వెల్లడించారు.

ఆట పాటలతో కూడిన విద్యను అందించాలి

ప్రజాశక్తి - వంగర

అంగన్వాడీ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని సూపర్వైజర్లు రజిని దుర్గ, సన్యాసమ్మ అన్నారు. అంగన్వాడీలకు మూడు రోజులు పాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని వారు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జెండర్ రీసోర్స్ సెంటర్ వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జెండర్ రీసోర్స్ సెంటర్ వినియోగించుకోవాలని హెచ్‌డి ఎపిఎం గీత అన్నారు. గురువారం ఆమె జెండర్ రీసోర్స్ సెంటర్‌ను సందర్శించి మాట్లాడుతూ లింగ వివక్ష సమస్యలు పరిష్కారానికి జెండర్ రీసోర్స్ సెంటర్ ఏర్పాటు అయ్యిందని సమస్యలున్నవారు గురువారం సెంటర్‌లో సంప్రదించి వారి సమస్యలు పరిష్కరించుకోవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఎపిఎం ఎస్‌విడి సురేష్, సిసిలు పాల్గొన్నారు.

తాగునీటి బోర్లకు మరమ్మతులు

ప్రజాశక్తి-వేపాడ

క్రాష్‌ప్రోగ్రాంలో భాగంగా మండలంలోని గ్రామాల్లో తాగునీటి బోర్లకు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు మరమ్మతులు చేపడుతున్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణ చర్యల్లో భాగంగా మరమ్మతులకు గురైన బోర్లను గుర్తించి, బాగు చేస్తున్నారు.

పాఠశాల సందర్శన

వేపాడ : మండలంలోని ఆకులసీతంపేట ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఇఒ పి.బాలభాస్కరరావు సందర్శించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, కిచెన్ గార్డెన్ పరిశీలించారు. టేబుల్స్ చదివించి, వర్క్ బుక్స్ పరిశీలించి, సంతృప్తి వ్యక్తంచేశారు.

ముగిసిన రామాంజనేయ ఉత్సవం

వేపాడ : మండలంలోని బొద్దాం గ్రామంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీరామాంజనేయ ఉత్సవం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా మహిళల కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎర్ర రామ సత్యవతి, గ్రామ పెద్దలు సన్యాసిరావు, మాజీ సర్పంచ్ జె.ఈశ్వరమ్మ, ఈశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

గేట్‌లో విశ్వనాథ్‌కు 60వ ర్యాంకు

ప్రజాశక్తి-కొత్తవలస



గేట్ పరీక్షలో కొత్తవలస మండలం కంటకాపల్లి పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన మిడతాన విశ్వనాథ్ కుమార్ ఆలిండియా స్థాయిలో 60వ ర్యాంకు సాధించాడు. విశ్వనాథ్‌ది సామాన్య రైతు కుటుంబం. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విద్యనభ్యశించాడు. విశ్వనాథ్ మొదటి ప్రయత్నంలోనే గేట్‌లో 60వ ర్యాంకు సాధించడం పట్ల పలువురు అభినందించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 26 మంది ఎంపిక

ప్రజాశక్తి-కొత్తవలస

ప్రగతి పాలిటెక్నిక్, ఐటిఐ కళాశాలలో గురువారం జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలో డిప్లొమా, ఐటిఐ విద్యార్థులు 26మంది ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ వనుము శ్రీనివాసరావు తెలిపారు. వీల్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీకి చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో ఎంపికైన విద్యార్థులకు వార్షిక జీతం రూ.2.5 లక్షలు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎం.సన్యాసినాయుడు, కళాశాల హెచ్ఒడి సి.హెచ్.కార్తిక్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.గౌరినాయుడు పాల్గొన్నారు.

లోచర్లలో గ్రామసభ

ప్రజాశక్తి- తెర్లాం

మండలంలోని లోచర్ల గ్రామంలో గురువారం తహశీల్దార్ హేమంత్‌కుమార్ ఆధ్వర్యాన రీసర్వే గ్రామసభ నిర్వహించారు. తొలుత గ్రామంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం నిర్వహించిన గ్రామసభలో ఆర్‌డిఒ రామ్మోహనరావు మాట్లాడుతూ రీసర్వే ప్రాధాన్యతను రైతులకు వివరించారు. సర్వే బృందాలకు రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహశీల్దారు, మండల సర్వేయర్ సాయి, విఆర్‌ఒలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

15 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-డెంకాడ

ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్సుమెంట్ సిఐ సింహాద్రి ఆధ్వర్యాన ఎస్ఐ రాజశ్రీ, సిబ్బంది కలసి గుణుపూరుపేటలో అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. వాటిని తరలిస్తున్న పెంటపల్లి రామలింగేశ్వరరావును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

పశువుల వ్యాను పట్టివేత

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మండలంలోని నెలివాడ వద్ద గురువారం వాహన తనిఖీలు చేస్తుండగా సతివాడి నుంచి విజయనగరం వైపుగా అక్రమంగా 15 పశువుల్ని తరలిస్తున్న ఒక బొలెరో వ్యాన్‌ని సీజ్ చేసి కేసు నమోదు చేశామని ఎస్ఐ గణేష్ తెలిపారు. అనుమతులు లేకుండా పశువులను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాఠశాల విలీనాన్ని అడ్డుకోవాలి

ప్రజాశక్తి-బొబ్బిలి



విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు విజయగౌరి

యుపి పాఠశాల విలీనాన్ని అడ్డుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి పిలుపునిచ్చారు. బొబ్బిలి మండలం రంగరాయపురం యుపి పాఠశాలను పెంట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విలీనం చేస్తూ విద్యాశాఖ అధికారులు మ్యాపింగ్ చేయడంతో గ్రామంలో గురువారం యుటిఎఫ్ బృందం పర్యటించింది. విద్యార్థుల తల్లిదండ్రులతో వారు మాట్లాడారు. రంగరాయపురంలో 6, 7, 8 తరగతులను పెంట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విలీనం చేస్తే విద్యార్థులు వెళ్లలేరని, దీంతో విద్యకు దూరమయ్యే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. యుపి పాఠశాల విలీనం చేస్తే తమ పిల్లలు ఇబ్బందులు పడతారని, రంగరాయపురంలోనే పాఠశాలను కొనసాగించాలని ఎస్ఎంసి చైర్మన్ ఎం.కృష్ణ, వైస్ చైర్‌పర్సన్ గొల్లపల్లి పాప కోరారు. పాఠశాలను తరలిస్తే ఆందోళన చేస్తామని తల్లిదండ్రులు చెప్పారు. కార్యక్రమంలో ఎంపిటిసి చొక్కాపు నారాయణరావు, మాజీ ఎంపిటిసి సభ్యులు వి.రామారావు, గ్రామపెద్ద చంటి, యుటిఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, శ్రీనివాస్, పకీర్ నాయుడు, రామకృష్ణ, కృష్ణదాసు, తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్, కాజ్‌వే నిర్మించాలి

డిప్యూటీ సిఎంకు బేబినాయన వినతి

ప్రజాశక్తి-బొబ్బిలి



పవన్ కల్యాణ్‌కు వినతినిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

బాడంగి మండలం పాల్తేరు, బొబ్బిలి మండలం అలజంగి గ్రామాల మధ్య చెక్‌డ్యామ్ కమ్ కాజ్‌వే నిర్మించి, సాగు, తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే బేబినాయన ప్రభుత్వాన్ని కోరారు. గురువారం అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. పాల్తేరు, అలజంగి గ్రామాలు వేగావతి నది పరివాహక ప్రాంతాలని చెప్పారు. సుమారు వెయ్యి నుంచి 1500 వరకు సాగునీటి బోర్లు ఉన్నాయని తెలిపారు. వ్యవసాయానికి ఆదర్శవంతమైన గ్రామంగా పేరుగాంచిన పాల్తేరు ఉన్న బాడంగి మండలానికి చెందిన సుమారు 18 గ్రామాలు, దత్తిరాజేరు మండలంలోని సుమారు 55 గ్రామాలకు సంబంధించి ఇక్కడ తాగునీటి పథకం ఉందని చెప్పారు. పాల్తేరు, అలజంగి గ్రామాల నడుమ చెక్‌డ్యామ్ కమ్ కాజ్‌వే నిర్మిస్తే, ఆ ప్రాంతంలో ఉన్న సుమారు 70 గ్రామాలకు వ్యవసాయ బోర్లు, మంచినీటి ఆధారిత బోరు బావులకు కావాల్సిన భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు.

గొల్లాది వంతెనపై పవన్‌కు వినతి

బాడంగి మండలం గొల్లాది గ్రామంలో వేగావతి నదిపై వంతెన నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే బేబినాయన.. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు వినతి అందించారు. గతంలో సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ ఇచ్చిన హామీలను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. ఈ వంతెన నిర్మాణం వల్ల బొబ్బిలి, బాడంగి ప్రాంతమే కాకుండా దత్తిరాజేరు, గజపతినగరం, మెరకముడిదాం మండలాలకు ఉపయోగపడుతుందని చెప్పారు.

ఎండిఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పూసపాటిరేగ



ఎంఇఒకు వినతినిస్తున్న సిఐటియు నాయకులు, ఎండిఎం కార్మికులు

సుమారు 22 సంవత్సరాల నుంచి ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజనం పథక కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు నాయకుల బచ్చల సూర్య నారాయణ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎంఇఒ పాపినాయుడకు వినతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల శ్రమకు తగ్గా ఫలితం దక్కడం లేదన్నారు. ఈ బడ్జెట్‌లో ఎండిఎం కార్మికులకు వేతనాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. 45,46వ ఇండియన్ లేబర్ కాన్ఫిరెన్స్ సిపారస్‌లను స్కీమ్ వర్కర్లకు వర్తింపజేయాలన్నారు. ఎండిఎం కార్మికులకు నెలకు రూ.26 వేలు జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అక్రమ తొలగింపులు, రాజకీయ వేధింపుల ఆపాలని, ప్రమాదబీమా, ఆరోగ్యబీమా, ప్రశూతి సెలవులు ఇవ్వాలని కోరారు. ఆయనతో పాటు కార్మికులు దిబ్బిడి నాగమణి, లెంక సీతమ్మ, దిబ్బిడి కంచెమ్మ తదితరులు ఉన్నారు.

పక్కాగా ఓటర్ల జాబితా

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఓటర్ల జాబితా నాణ్యత, స్వచ్ఛత మెరుగుపరచడానికి బూత్ లెవెల్ అధికారులు (బిఎల్‌ఒ) నిరంతరం కృషి చేయాలని నియోజకవర్గ సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తహశీల్దార్ బి సుదర్శన్ రావు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన బిఎల్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రాతినిధ్య చట్టాల ప్రకారం ఓటర్ల జాబితా తయారీ పక్కాగా జరగాలన్నారు. ప్రతి ఓటరుతో మర్యాదగా మాట్లాడి, వారు ఏ సమస్యలపై మాట్లాడినా సామరస్యంగా సమాధాన పరిచి పరిష్కరించి, పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు విషయంలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. పోలింగ్ బూత్‌లు ఓటర్ల నివాసానికి రెండు కిలోమీటర్ల లోపు ఉండాలన్నారు. ఒక పిఎస్‌లో 800 నుండి 1200 మధ్య ఓటర్లను 800 కన్నా తక్కువ ఓటర్లు ఉన్న పిఎస్‌లో విలీనం చేసి ఓటర్లకు ఇబ్బంది లేకుండా వారిని గౌరవించాలని ఆయన సూచించారు. సమావేశంలో హెచ్‌డిటి రవిశంకర్, ఎన్నికల విభాగం డిటి వివిఆర్ జగన్నాథ రావు, ఇఒఆర్‌డి శంకర్ జగన్నాథం, సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ వాడకంతో డబ్బు ఆదా

అవగాహన సదస్సులో ఎడిఇ కిరణ్ కుమార్

ప్రజాశకి-విజయనగరం టౌన్

ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎపిఇపిడిసిఎల్ ఎడిఇ కిరణ్ కుమార్ కోరారు. గురువారం గాజులురేగలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా సోలార్ వినియోగం వలన విద్యుత్ బిల్లులు తక్కువగా వస్తాయన్నారు. సోలార్ విద్యుత్ వినియోగం ఆరోగ్యానికి హాని కలిగించేది కాదన్నారు. ఇంటి పైన సోలార్ అమర్చుకోవడం ద్వారా కోతలకు ఆస్కారం ఉండదన్నారు. సోలార్ వాడకం అంటే డబ్బు ఆదాతో పాటు ఆరోగ్యకరమని, సబ్సిడీ ద్వారా అందిస్తున్న ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామైక్య సంఘాల తీర్మానాల మేరకే విధులు

ప్రజాశక్తి-రామభద్రపురం

రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామైక్య సంఘాల తీర్మానాల మేరకే వెలుగు సిబ్బంది విధులు నిర్వర్తించాలని వెలుగు ఏరియా కోఆర్డినేటర్ నందిగాం ఆదయ్య హెచ్చరించారు. స్థానిక మండల వెలుగు కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యంగా కొంత మంది సిబ్బంది ఎక్కువ కాలం ఒకే చోట పనిచేయడం వలన కొంత అవినీతికి పాల్పడుతున్నట్టు తమ దృష్టికి వస్తోందని, వారిపై పూర్తిస్థాయి విచారణ జరుపుతామని తెలిపారవు. గ్రామైక్య సంఘాల తీర్మానాలకు వ్యతిరేకంగా ఎవరు పనిచేసినా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులను బలోపేతం చేయడానికి ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ క్లస్టర్లు ఏర్పాటు చేసిందని, ఇందులో భాగంగా రామభద్రపురం, దత్తిరాజేరు మండలాలను పైలెట్ ప్రోగ్రాంగా ఎంపిక చేశామని తెలిపారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం కోట్ల అన్నపూర్ణ, సిసిలు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై విచారణ

ప్రజాశక్తి-వేపాడ



ఫిర్యాదుదారు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న డిఎస్‌పి

వల్లంపూడి ఎస్ఐ దేవిపై మండలంలోని గుడివాడ గ్రామానికి చెందిన గుడివాడ కృష్ణమ్మ పెట్టిన అట్రాసిటీ కేసుపై డిఎస్‌పి వీరకుమార్ గురువారం విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారు ఇంటికి వెళ్లారు. అక్కడ ఫిర్యాదుదారు లేకపోవడంతో కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆరోజు గ్రామంలో జరిగిన ఘటనపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న గ్రామంలో కొంతమంది వ్యక్తులు కావాలనే గొడవలు సృష్టిస్తున్నారని తెలిపారు. అటువంటి వారి మాటలు విని అమాయకులు మోసపోవద్దని కోరారు. గ్రామస్తులు ఐక్యంగా ఉండాలని విజ్ఞప్తిచేశారు. దర్యాప్తులో ఎస్.కోట రూరల్ సిఐ అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం

ప్రజాశక్తి-రామభద్రపురం

అన్ని పంచాయతీల్లో వంద శాతం ఇంటి పన్ను వసూళ్లు పూర్తి చేయాలని ఎంపిడిఒ రత్నం.. సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం ఆరికతోట, నరసాపురం, దుప్పలపూడి, బూసాయవలస పంచాయతీల్లో చేపడుతున్న ఇంటి పన్ను వసూళ్ల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. పన్ను చెల్లించే యజమానులకు వెంటనే రశీదులు ఇవ్వాలన్నారు. పి-4 సర్వే ఈ నెలాఖరులోగా వందశాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సతివాడలో రీ సర్వే ర్యాలీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సతివాడలో 2వ విడతలో భాగంగా గురువారం రీ సర్వే ర్యాలీ నిర్వహించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ బి.సుదర్శన్‌రావు ఆధ్వర్యంలో రీ సర్వే పై ర్యాలీ జరిపి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సుదర్శన రావు, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ రీ సర్వే ఆవశ్యకత ను వివరించి, రైతులు తమ భూముల్లో సర్వే చేస్తున్నపుడు తగిన ధ్రువ పత్రాలతో హాజరవ్వాలని కోరారు. సరిహద్దు రైతులు కూడా హాజరు అవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ దివ్య మానస, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు సతివాడ గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు.

కెజిబివిలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వ కెజిబివిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బి. ఉమా గురువారం ఒక ప్రకటనలో కోరారు. కస్తుర్బా బాలికల విద్యాలయంలో 2025-26 విద్యాసంవత్సరానికి 6వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం (ఎంపిసి) ప్రవేశానికి, ఇతర తరగతుల్లో మిగులు సీట్లు భర్తీకి ఏప్రిల్ 4లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యాలయంలో ఆంగ్ల మాధ్యమంలో డిజిటల్ బోధన, ప్రభుత్వ పథకాలు అమలు జరుగుతుందన్నారు. వ్యాయామ విద్య, క్రీడల్లో శిక్షణ కల్పించి నాణ్యమైన భోజనం, శిక్షణ పొందిన అధ్యాపకులచే తరగతులు నిర్వహిస్తామని నిరంతర పర్యవేక్షణ, క్రమశిక్షణతో కూడిన బోధనలు అందిస్తామని చెప్పారు. డ్రాప్ ఔట్ బాలికలు, అనాథలు, తల్లి దండ్రులు కోల్పోయిన పిల్లలు సంబంధిత ధ్రువ పత్రాలు, కులం, ఆదాయం, తలి దండ్రుల ఆధార్ కార్డు, పాస్ ఫోటో, పాస్ సర్టిఫికెట్ జత పర్చి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7901098524 నెంబర్ సంప్రదించాలని కోరారు.


చాట్ యాప్‌తో రైతులకు ప్రయోజనాలు

ప్రజాశక్తి- మెరకముడిదాం

చాట్‌యాప్ ద్వారా రైతులకు అనేక ప్రయోజనాలు కలుగుతాయని డిజిటల్ గ్రీన్ సంస్థ కమలాకర్ తెలిపారు. గురువారం మండలంలోని బుధరాయవలస గ్రామంలో కిసాన్ క్రాంతి ఎఫ్‌పిఒ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా సుమారు 100 కిలో మీటర్ల పరిధిలో గల అన్ని మార్కెట్లలో అన్ని పంటల ధరలు తెలుస్తాయన్నారు. పంటలకు నష్టం చేకూర్చే చీడ పురుగులు గురించి చెప్తూ ఏఏ సమయాల్లో ఎంత మోతాదుల్లో క్రిమి సంహారిక మందులు వేయాలో తెలిపారు. ప్రతి రైతు భూమి సారం తెలుసుకునేందుకు మట్టి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కిసాన్ క్రాంతి ఎఫ్‌పిఒలో సోయిల్ టెస్ట్ చేయటానికి పరికరాల కిట్లు ఉన్నాయన్నారు. ఆండ్రాయిడ్ మొబైల్‌లో యాప్ డౌన్లోడ్ చేసి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్రేడ్స్ కో -ఆర్డినేటర్ శివ, కిసాన్ క్రాంతి ఎఫ్ పీవో, సివో వెంకటరెడ్డి, కిసాన్ ఎఫ్ పీవో అధ్యక్షులు బాలి చిన్నారి, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం మేలు : డిపిఎం

ప్రజాశక్తి- బొబ్బిలిరూరల్



మాట్లాడుతున్న డిపిఎం ఆనందరావు

ప్రతి రైతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించేలా అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయ శాఖ డిపిఎం ఎం.ఆనందరావు తెలిపారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఎపి రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో వెలుగు, వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ శాఖలతో ప్రకృతి వ్యవసాయం, నవధాన్యాల సాగుపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులు వాడకం లేకుండా జీరో కాస్ట్ విధానం ద్వారా ప్రకృతి సిద్ధ వనరులతో చిరు, నవధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ ఎడి ఎం.శ్యామసుందర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో పాటు రైతులు అనుబంధ సాగు పద్ధతులు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం పి.భాగ్యలక్ష్మి, డిపిఎం రమేష్ నాయుడు, సిసిలు, విఒఎలు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని ఎన్‌కెఆర్ పురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై గ్రామసభ ఏర్పాటు చేశారు. ఎంపిటిసి వి.వి. చినరామినాయుడు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొటివాడ దేవి, పి.రమణ, జగ్గు బాబు, రామ్మూర్తి నాయుడు, పెదనాయుడు, ఒబి కృష్ణ శాంతి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సన్యాసమ్మ, నారాయణమ్మ, ప్రసాద్, దేముడు, వెంకటరావు, ఈశ్వర్, రమణమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

శృంగవరపుకోట : ప్రకృతి వ్యవసాయ, మండల సమాఖ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎఒ రవీంద్ర అన్నారు. గురువారం మండల సమాఖ్య కార్యాలయంలో విఒఎలకు, ప్రకృతి సిబ్బందికి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులను ప్రకృతి వ్యవసాయంలో మార్చడానికి మీ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎపిఎం యు.రమణ, రాష్ట్ర స్థాయి అధికారి కృష్ణప్రసాద్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అనురాధ పాల్గొన్నారు.

చేపల చెరువుల యజమానులపై క్రిమినల్ కేసులు పెట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి-బాడంగి

ప్రజల ప్రాణాలకు హాని కలిగించి, సొమ్ము చేసుకుంటున్న చేపల చెరువుల యజమానులపై క్రిమినల్ కేసులు పెట్టి, వెంటనే అరెస్టు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి ఎ.సురేష్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని హెచ్.పాల్తేరు సమీపంలోని చేపల చెరువులను ఆయన పరిశీలించారు. చేపల చెరువుల్లో చనిపోయిన, కుళ్లిపోయిన బ్రాయిలర్ కోళ్లు, వ్యర్థ పదార్థాలను చేపలకు ఆహారంగా వేస్తున్నారని తెలిపారు. దీనిపై మత్స్య, రెవెన్యూ శాఖల అధికారులు స్పందించి చర్లయు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

నెల్లిమర్ల సబ్ స్టేషన్ పరిధిలో చెట్టు కొమ్మలు తొలగించడం, మరమ్మత్తులు పనులు చేయడానికి శుక్రవారం ఉదయం 9గంటల నుంచి 2గంటల వరకు నెల్లిమర్ల, జరజాపు పేట, రామతీర్థం, మొయిద జంక్షన్, థామస్ పేట, లక్ష్మీ దేవిపేట ప్రాంతాల్లో విద్యుత్తు అంతరాయం కలుగుతుందని డిఇఇ పి.త్రినాధరావు తెలిపారు. వినియోగదార్లు సహకరించాలని ఆయన కోరారు.